




# తెలుగుకు సమాధి

డా. టి. సంపత్ కుమార్

హరేరామ హరేరామ
రామరామ హరేహరే !
హరేకృష్ణ హరేకృష్ణ
కృష్ణ కృష్ణ హరే హరే !

వేసవి సెలవుల్లో వచ్చిన మనవరాలికి ఫ్రేంలో బిగించిన హరినామ స్తోత్రాక్షరాల్ని చూపిస్తూ పలకడం నేర్పుతున్నాడు పురుషోత్తం. తెలుగురాని ఆమనవరాలు ఫ్రేంవైపు చూస్తూ తాత చెప్పిన ప్రకారంగా స్పష్టంగా తియ్యగ పలుకుతుంది.

"ఇప్పుడు చదువమ్మా, చూద్దాం'

"హరేకృష్ణ హరేకృష్ణ – కృష్ణ కృష్ణ హరే హరే" ఫ్రేంను చూస్తూ పెద్దకళ్ళను చిత్రంగా తిప్పుతూ చదివింది.

"తప్పు...తప్పు...మొదట వచ్చేది రాముడమ్మా!"

"ఎంత గుర్తు పెట్టుకుందామన్నా కుదరడం లేదు తాతయ్యా!" తనకొచ్చిన భాషైన ఇంగ్లీషులో అనేసి ఫ్రేం వైపే తదేకంగా చూసింది....కాస్సేపయ్యాక ఏదోకని పెట్టిన దానిలా ముఖంపై ఓ వెలుగు వెలిగింది.

"తాతయ్యా! ఇక ఎప్పుడు తప్పుపోదు, చూడు."

మనవరాలు నిజంగానే తప్పులేకుండా చదివింది. పురుషోత్తం మనసు తేలికపడింది.

"తాతయ్యా! తప్పులేకుండా ఎలా చదవగలగానో "ట్రిక్కు" చెప్పనా?" విజయం సాధించానన్న చక్కని పోజు ఇస్తు అంది.

"ఆఁ! చెప్పు, చూద్దాం."

"ఫ్రేంలో మొదటి లైను ఎరుపు రంగులో ప్రింట్ చేసారు. అంటే 'ఆర్ ఫర్ రెడ్'..రెడ్ ఫర్ రామా'... ఇక 'రామ' పోతె మిగిలింది కృష్ణుడేగా! అందుకే తప్పులు లేకుండా చదివాను తాతయ్యా!'పురుషోత్తం నవ్వుకున్నాడు. అంతకంటె ఎక్కువగా బాధపడ్డాడు. మనవరాలుండేది మరి ఢిల్లీలో.. చదివేది పబ్లిక్ స్కూల్లో...



ప్రతివేసవి సెలవుల్లోమనవలు,మనవరాళ్ళు రావడం, ఉన్నన్ని రోజులు తెలుగు నేర్పేప్రయత్నంలో శ్లోకాలు,వేమనపద్యాలు వారితో పలికించడం చేస్తుంటాడు.

పురుషోత్తం తండ్రీ, తాతలు తెలుగులో మంచిపండితులు.వారికాలంలోమంచి పేరు సంపాదించారు. ఎన్నో పుస్తకాలు రాసి ఎంతో ఖ్యాతిని గడించారు. పురుషోత్తం మాత్రం ఉద్యోగాన్ని ఆశ్రయించడం వల్ల తన పూర్వీకుల్లా పుష్కలంగా రచనలు చేయకపోయినా అడపాదడపా ఏవో రాస్తూ తన తండ్రి తాతల సాంప్రదాయాన్ని నామమాత్రంగా కొనసాగిస్తున్నాడు. మనదేశంలో 'తెల్లోళ్ళు' చొరబడ్డట్టు పురుషోత్తం తరంలో వారి ఇంట్లోకీ ఇంగ్లీసు చాపకింది నీరులా ప్రవేశించింది. వెనకనుండి రెండు తరాల అనుభవాన్ని ఇంగ్లీషులో చూస్తున్నాడు. దగ్గినా, తుమ్మినా తెలుగుతనం ఉట్టిపడేగతం, ప్రమాదాల్లో పలవరింతల్లో మమ్మీ- డాడిలను కక్కుకునే వర్తమానం. వీటి మధ్య లఘులోలకంలా అటూఇటూ ఊగుతున్నాడు పురుషోత్తం.

"తాతయ్యా! టెలిగ్రాం వచ్చింది. తొందరగా రండి." మనవరాలు పిలిచింది.

ఎవరో దగ్గరి బంధువు పోయాడు. కొడుకు కోడళ్లకు ఇల్లప్పచెప్పి పురుషోత్తం, భార్య అమృత వెంటనే బయలుదేరారు.

పురుషోత్తానికి ఇద్దరు కొడుకులు, ఒక కూతురు. ఉద్యోగరీత్యా పెద్ద పట్టణాల్లో ఉండటంవల్ల పిల్లల చదు

వంతా కాన్వెంట్ స్కూళ్ళలో సాగింది. తెలుగంతగా అబ్బలేదు. కాలేజీకొచ్చే సరికి పిల్లలకు తెలుగు మాట్లాడ్డం తప్ప ఓమాదిరిగా రాయడం కాని, కనీసం పెద్దక్షరాలనైనా ధారాళంగా చదవడం కాని రాలేదు. పురుషోత్తం తన శాయశక్తులా ప్రయత్నించినా పిల్లల తెలుగుకు పట్టిన తెగులును మాత్రం నిర్మూలించలేక పోయాడు. పై చదువుల్లోకి చేరాక అప్పటికే వాళ్ల జీవితాల్లో మైనారిటీ స్థితిలో ఉన్న తెలుగు తన ఉనికిని కోల్పోయింది. ఈ పరిణామాన్ని పురుషోత్తం గమనించినా, నాలుగురోడ్ల కూడలిలో ప్రభుత్వం ప్రతిష్ఠించిన గాంధీ విగ్రహంలా చూస్తూ ఉండిపోయాడు.

వేసవిలో ఇంటికొచ్చినపుడల్లా ఏవో కొత్త పోకడలతో ఇంటిని తమరుచుల కనుకూలంగా మార్చుకోవాలనుకునే కొడుకు-కోడళ్లకు ఇప్పుడు అమ్మా-నాన్నా ఊరికి వెళ్ళడం చక్కగా కలిసొచ్చింది. ఇంకో పదిరోజుల్లో రాబోయే తమ్ముడు, చెల్లెళ్ళకు మంచి సర్‌ప్రైజ్ ఇవ్వొచ్చు అన్న ఆలోచన వాళ్ళ ఉత్సాహాన్ని మరింత పెంచింది.

పురుషోత్తం తిరిగొచ్చాడు. అమృతపెద్ద కర్మ అయ్యేంతవరకని ఉండి పోయింది.

ఇంట్లోకి అడుగు పెడుతూనే స్థాన భ్రంశం చెందిన ఫర్నిచర్‌ను గమనించాడు. కోడలిచ్చిన నీళ్ళను తాగుతూ గోడల్ని పరిశీలించాడు. "హరేరామ హరేరామ.....' ' ఫ్రేం ఉన్నచోట స్విట్జర్లాండ్ ప్రకృతి దృశ్యపు ఫ్రేం ఒకటి వేలాడుతోంది. దానిపై ఓమూలన "ప్రేయర్స్ గో అప్- బ్లెస్సింగ్స్ కమ్ డౌన్" అని ఉంది. దగ్గరికెళ్ళి పరీక్షగా చూసాడు. ఏళ్ళనుండి చేసిన రామకృష్ణుల స్మరణానికి అంతిమ రూపం ఇదే కాబోలు అనుకున్నాడు.

ప్రయాణపు బడలికతో స్నానం కానించాడు. ఎంగిలిపడి మంచం పై వాలాడు. కళ్ళుమూసుకున్నా పాతఫ్రేంలోని రామ-కృష్ణుల రంగుల అక్షరాలే కళ్ళముందు తిరగసాగాయి. ఎంతకూ నిద్ర రాలేదు. ప్రాయాణపుఅలసటశరీరంపై ఏమాత్రం ఉన్నట్టు అనిపించలేదు. వక్కపై అసౌకర్యంగా దొర్లుతూ "హరేరామా హరేరామ......" అని స్మరించుకుంటూ నిద్రలోకి మెల్లగా జారిపోయాడు.

మరునాడు పొద్దున్నే పురుషోత్తం కాఫీతాగి పై గదిలోకెళ్ళాడు. అది తనగది. తెలుగు పుస్తకాల భాండాగారం. అల్మారాలన్నీ ఖాళీగా ఉన్నాయి! నాలుగు రోజుల్లో ఏం మాయ జరిగిందానన్న ఆలోచనల్లోంచి తేరుకోకముందే కొడుకు పైకొచ్చాడు.

"అల్మారాలన్ని పుస్తకాలతో బరువును మించి పోయాయి. గదంతా ఏవేవో పుస్తకాలతో చిందరవందరగా అని పించింది. మీరు తప్పఇంట్లో ఆ తెలుగుపుస్తకాల్ని ఆసక్తితో చదివేవారెవరు లేరు కదా డాడీ! మీ కళ్ళు ఎలాగూ ఎక్కువ స్ట్రేన్ కాకూడదని డాక్టర్లు రెండు మూడేళ్ళ నుండి చెబుతూనే ఉన్నారు. అమ్మకు ఇంటిపనితోనే సరిపోదు. తెలుగు పుస్తకాల ఉపయోగం ఎలాగూ ముందు ముందు ఈ ఇంట్లో ఉండదని తీసేసాం డాడీ."

పురుషోత్తం ఇంకా షాక్‌నుండి తేరుకోలేదు. కొడుకు మాటల్ని శ్రద్ధగా విన్నాడు. పుస్తకాలపై ఏళ్ళనుండి పెంచుకున్న మమకారం కొడుకు చేసిన పనిని హర్షించలేక పోతుంది. కాని .... కాని.... అతనన్న మాటల్లో నిజం లేకపోలేదు. తన తరువాత ఈ తెలుగు పుస్తకాలు తన పిల్లలెవరికీ అక్కరకురావు. తాను అనారోగ్యదృష్ట్యా దీర్ఘపఠనం మానేసాడు. కొడుకు చేసిన పనిలో తప్పులేదేమో? మనసులో అనుకున్నాడు పురుషోత్తం బయటకు మాట్లాడలేదు. గంభీరంగా ఉన్నాడు.

స్టాక్ మార్కెట్‌లో నిమిష-నిమిషానికీ వచ్చే మార్పులతో దివాలా తీసినవాడిలా పురుషోత్తం ఒక్క మూడు రోజుల్లో కోటాను కోట్ల తెలుగక్షరాలు తన ఇంటి ఆశ్రయం కోల్పోవడంతో డీలా పడిపోయాడు. శరీరాన్నుండి శక్తినెవరో పీల్చుకున్నట్లైంది. అందుకు మరోకారణం కూడ ఉంది. ఆపుస్తకాల్లో తన భార్య అమృత మొదటి పెళ్ళిరోజున ఇచ్చిన బహుమానం కూడా ఉంది. ఆ పుస్తకాన్ని తాను ఎలా మరవగలడు?

ఉద్యోగం వచ్చిన రెండునెలలకే తనకు పెళ్లయింది. రోజులు సంతోషంగా గడుస్తూ ఉండేవి.

చూస్తుండగానే సంవత్సరం కావచ్చింది. పెళ్ళిరోజుకు ఇంకా పది రోజులే ఉంది.

ఆరోజు పురుషోత్తం ఆఫీసుకు చేరగానే పై అధికారి పిలిచి అర్జంటు పనిమీద వెంటనే బయలుదేరి గిరిజన ప్రాంతంలో అమలులో వున్న ఓ ప్రాజెక్టు పనిని చూసి నివేదిక తయారుచేసుకు రమ్మని ఆదేశించాడు. పని పూర్తిచేసుకున్నాకే తిరిగి రమ్మని మరీహుకుంజారీ చేసాడు. పెళ్ళిరోజు దగ్గర్లో ఉంది. ఇక మాట్లాడ్డానికి ఏమాత్రం అవకాశం లేకపోవడంతో ఆఫీసునుండి వెంటనే బయలుదేరాడు. పెళ్ళిరోజుకు ఎలాగయినా ఇంట్లో ఉండాలన్న ఆశబలంగా ఉంది. పని పూర్తవడానికి ఎన్నిరోజులు పడుతుందో? ఎనిమిది-తొమ్మిది రోజుల్లో అవగొడితేకాని పెళ్ళిరోజుకల్లా తాను ఇంటికి చేరుకోలేడు. భార్యకీ విషయం చెప్పి, నిరుత్సాహం నిండుకున్న ఆమెవైపు చూస్తూ ఏసమయానికైనా,మొత్తానికి పెళ్ళిరోజుకల్లా తప్పక చేరుకుంటానని భరోసా ఇచ్చి బయలు దేరాడు.

ప్రాజెక్టు ప్రదేశానికి చేరుతూనే అలసట విశ్రాంతుల జోలికి పోకుండా పనిచూసుకొని నివేదిక తయారీలో నిమగ్నుడయ్యాడు. అనుకున్న సమయానికే పనిపూర్తిచేసుకొని మొత్తానికి పెళ్ళిరోజు సాయంత్రం నాలుగ్గంటలకల్లా ఇంటికి చేరుకోగలిగాడు. ఏదో సాధించానన్న తృప్తి!

పొద్దుటి నుండి ఎదురుచూస్తోన్న అమృతకు మళ్ళీపెళ్ళినాటి సంబరం కలిగింది.

ఇంటికి చేరుకున్న పురుషోత్తం కుడి ముంజేయిని మాత్రం భార్యకంట పడనీయకుండా అతి జాగ్రత్తపడ్డాడు. కావాలనే ఆరోజు ఫుల్‌షర్టు వేసుకున్నాడు. స్నానం చేసాక వెంటనే కుర్తావేసుకున్నాడు. అసంకల్పితంగా పైకి ముడుస్తానేమోనని జాగ్రత్తగా ఉన్నాడు. దేని గురించో ఆరాటం! ఎందుకో తత్తరపాటు!!

"అందరు భర్తలూ మొదటి పెళ్ళిరోజు భార్యలకు మంచి మంచి బహుమతులిస్తారు. మరి మీరేం తెచ్చారు నాకూ?!" కళ్ళలోకి ఆశగా చూస్తూ గోముగా అడిగింది అమృత.

"చూసావుగా! నేవెళ్ళింది. కొండ ప్రదేశం. అక్కడేందొరుకుతుంది. చెప్పు. ఈరోజు ఇంటికి చేరుకునేసరికి సాయంత్రం

అయ్యింది. మార్కెటెళ్ళేందుకు సమయమే దొరకలేదు. ఏమనుకోకు వచ్చే సంవత్సరం తప్పకుండా మంచి గిఫ్ట్ ఇస్తాలే!" ఊరడిస్తూ ఎంతో సీరియస్‌గా చెబుతామనుకుంటే అల్లరి చిరునవ్వొకటి తొంగిచూసింది.

"ఏదో దాస్తున్నారు." వ్యవహారం పసి గట్టి అనుమానంగా అంది అమృత.

"కళ్ళు మూసుకో"

అమృత కళ్ళుమూసుకొంది. ఆమె ముందు తను కుడిముంజేతిని చాచాడు.

"ఆఁ! ఇప్పుడు మెల్లగా కళ్ళు తెరువు." అమృత కళ్ళు తెరిచింది. ఏమీ లేక పోవడంతో ఆటపట్టిస్తున్నాడనుకొని సత్యభామలా కొంటె కోపంతో చూసింది.

"ఆఁ! ఆఁ!! ఆఁ!!!..... కాస్త ఓపిక పట్టు మెల్లగా కుడి ముంజేతిచొక్కాను పైకి జరుపు."

ఏదో పెద్ద సర్‌ప్రైజ్ ఉందేమోనని కుతూహలంతో మెల్లగా చొక్కాని పైకి జరిపింది.

ఆశ్చర్యం... సిగ్గు .... గర్వం... ఆమెలో!

పచ్చబొట్టుతో తెలుగులో రాసిన తన పేరు .... అమృత. టూర్లో ఉన్నప్పుడు గిరిజనులతో రాయించాడు. ఆమె పురుషోత్తంను గట్టిగా కౌగిలించుకుంది. చేయిని మెల్లగా తీసుకొని 'అమృత'ను మృదువుగా తాకుతూ మరోసారి పరీక్షగా చూసుకుంటూ అక్షరాల్ని ముద్దుపెట్టుకుంది....

దిండు కింద దాచినప్యాకెట్‌ను తీసి తనకానుకంటూ పురుషోత్తం చేతిలో ఉంచి చప్పున కళ్ళుమూసుకొంది. విప్పిచూస్తే తన అభిమాన రచయిత రాసిన తాజా కవితా గుచ్ఛం. ఆగుచ్ఛమే ఇప్పుడు తన పుస్తకాలతో ఇంటినుండి వెళ్ళిపోయిందని బాధ... వేదన.. గుండెనెవరో ముళ్ళతో పొడిచినట్టుగా ఉంది.

ఇంకా ఏవేవో మార్పులు, చేర్పులు, కూర్పులతో ఆ ఇల్లు తన ఇల్లేనా అన్న సందిగ్ధావస్థలో పడిపోయాడు పురుషోత్తం.

"తాతయ్యా! బ్రేక్‌ఫాస్ట్ రెడీ," మనవరాలు కబురందించింది. డైనింగ్ టేబుల్ దగ్గరికి మెల్లగా నడిచాడు.

ఉప్మాకు పెరుగును కలిపి తినసాగాడు. మనవరాలేమో బ్రెడ్‌జామ్ తింటూ నీళ్ళుతాగడానికి గ్లాసను పైకి లేపినపుడు దానిపై చెక్కించిన పేరు ఆకర్షించింది. తనలో తానే చదువుకుంది. తాతయ్య దగ్గరి గ్లాసునందుకొని దానిపై ఉన్న పేరునూ చూసింది. తనప్లేట్‌ను పైకెత్తి అడుగునున్న పేరును కుతూహలంగా చదివింది. టేబుల్‌పైనున్న ప్రతి పాత్రను వదల కుండ పేర్లన్నింటిని చదివింది.

"తాతయ్యా! పేర్లన్నీ ఇంగ్లీషులోనే ఉన్నాయి. తెలుగులో ఒక్క పేరుకూడ లేదు తాతయ్య!" అడిగింది ఆంగ్లంలో.

"తెలుగుకు ఈ ఇంట్లో స్థానం లేదమ్మా... అర్థంచేసుకునే వారు లేరుగా.. తెలుగులో ఉంటే మరి నువ్వు చదవగలిగేదానివా?" నెమ్మదిగా వచ్చాయి మాటలు. ఇంకా ఏదో చెప్పబోయాడు. కాని ఎందుకో వేదాంతిలా ఆగిపోయాడు.

పురుషోత్తం నిద్రనుండి లేవగానే మనవరాలు పోస్ట్‌లో వచ్చిన ఉత్తరాన్ని చేతిలో పెట్టింది. ఊరినుండి వచ్చినప్పటి నుండి ఏది సరిగ్గా చదవలేకపోతున్నాడు. చనిపోయిన వారింట్లో హడావుడిగా ఉండడంతో కళ్ళజోడు ఎక్కడో పెట్టి మరిచాడు. తానూ, అమృతా ఎంత వెదికినా దొరకలేదు. వచ్చాక ఇంట్లో జరిగిన మార్పుల్ని చూసాక మనసంతా పీకుతుండడంతో కొడుక్కి మరోజోడు తెమ్మని వెంటనే చెప్పలేకపోయాడు. చూపు సరిగ్గా ఆనకపోవడంతో ఉత్తరం ఎవరినుండి వచ్చిందో తెలియడం లేదు కానీ తెలుసుకోవాలన్న కుతూహలం!

"డాడీని పిలువమ్మా," ఎవరినుండి వచ్చిందో తెలిసినా చాలు ఈ పూటకు అని అనుకున్నాడు.

"ఏం డాడీ?" కొడుకు అడిగాడు.

"ఈ ఉత్తరం ఎక్కడి నుంచో చూడు"

ఉత్తరాన్ని అందుకొని అటూఇటూ చూసాడు. కళ్ళనూ పైకీ కిందకూ కదల్చాడు. 'రాసిన వారి అడ్రస్ లేదు. తెలుగు రాత గొలుసులో ఉంది. చదవలేను డాడీ." ఉత్తరాన్ని తండ్రి చేతిలో ఉంచి అక్కడి నుండి కదిలాడు. ఎక్కువగా ఆశించని పురుషోత్తంకు బాధకలుగలేదు. ఉత్తరాన్ని మాత్రం వేళ్ళతో స్పృశించాడు. కళ్ళలో నిండుకున్న నీరు మళ్ళీ కళ్ళలోనే ఇంకిపోయింది. అదే కాలనీలో ఉంటున్న రమణయ్య సాయంత్రం ఏదోపనితో పురుషోత్తంను కలవడానికి వస్తే ఉత్తరం చదివించాడు. జవాబు కూడ ఆయనతోనే రాయించాడు.

భోజనంచేసినప్పటినుండి పురుషోత్తంకు చాలా గుబులుగా అనిపించింది. శరీరంనుండి శక్తినంతా లాగేసినట్టవుతోంది. ఎందుకిలా అవుతోందని ఆలోచిస్తే నిర్దిష్టమైన కారణమంటూ ఏమి కనబడడం లేదు. అమృతతో ఈ విషయాన్ని పంచుకుంటే మనసు తేలిక పడేదేమో. తానైతే తెలుగులా చక్కగా వెంటనే అర్థం చేసుకొని ఉపశమనం కలిగించేది. తన శరీరంపై పచ్చబొట్టులో నున్న 'అమృత'ను పెదములతో తాకాడు. సున్నితత్వానికీ వయస్సు మళ్ళడంతో జీవం లేని వస్తువులు ఒకదాన్ని మరొకటి తాకినట్టనిపించింది. ఎడమ చేతివేళ్ళతో అక్షరాల్ని తాకేందుకు ప్రయత్నం చేసాడు. వేళ్ళు అక్షరాల్నే తాకుతున్నాయా లేదా అన్న సందేహం ఆయనకు కలుగలేదు. దిగులుగా ఉన్న గుండె బరువెక్కింది. అసౌకర్యంగా పక్కలో దొర్లుతూ నిద్రకోసం మూడు జాముల వరకూ కుస్తీపట్టాడు.

పొద్దున్నే లేచేమనిషి పొద్దెక్కినా లేవకపోవడంతో కొడుకు తండ్రిదగ్గరికి వెళ్ళాడు. పరీక్షగా చూసాడు. ఏదో అనుమానం వేసింది. 'నాన్నా' అని పిలిచాడు. జవాబు రాలేదు... నిశ్శబ్దం... మళ్ళీ పిలిచాడు... కంగారెక్కువై భార్యను కేకేసాడు.

ఇద్దరూ గొల్లుమన్నారు. దగ్గరి బంధువులూ, అమృతా సాయంత్రానికల్లా చేరుకున్నారు.

"ఇప్పటికే ఆలస్యం అయ్యింది. ఇక కానీయండి." ఎవరో పెద్దమనిషి తొందర పెడుతున్నాడు.

బరువెక్కిన పురుషోత్తం శరీరాన్ని మోస్తూ ఇంట్లో మిగిలిన ఆచివరి మూడు తెలుగక్షరాలూ బయటకు నడిచాయి.